ముఖ్యమంత్రి కార్యాలయము

తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 11, నవంబరు, 2014

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనేతరులకు కూడా పంట రుణ మాఫీ పథకం వర్తింపచేయనున్నట్లు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. తెలంగాణలో రైతులకు 17 వేల కోట్ల రుపాయల పంట రుణాలు మాఫీ చేస్తున్న క్రమంలో మరికొంత భారమైనా ట్రైబల్ ప్రాంతాల్లో నోటిఫైడ్ చేసిన భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న గిరిజనేతరులకు లక్ష రూపాయల లోపు రుణాలు మాఫీ చేస్తామని చెప్పారు. అసెంబ్లీలోని కమిటీ హాల్లో గిరిజన ప్రాంతాలకు చెందిన ఎమ్మెల్యేలు అజ్మీరా చందులాల్, జలగం వెంకట్రావ్, సండ్ర వెంకటవీరయ్య, తాటి వెంకటేశ్వర్లు, గువ్వ బాలరాజు, నల్లాల ఓదేలు, శంకర్‌నాయక్, రేఖా నాయక్, కోవ లక్ష్మీ, కనకయ్య, సున్నం రాజయ్య, సీనియర్ అధికారులు నాగిరెడ్డి, పూనం మాలకొండయ్య, రాధ, జనార్ధన్‌రెడ్డి, వరంగల్, మహబూబ్‌నగర్, ఖమ్మం కలెక్టర్లు ప్రియదర్శిని, జి.కిషన్, ఇలంబర్తి తదితరులతో సిఎం సమావేశమయ్యారు. వ్యవసాయ శాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, సిఎంఓ ముఖ్య కార్యదర్శి నర్సింగరావు సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణలోని ఖమ్మం, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ లాంటి జిల్లాల్లో గిరిజనుల భూములుగా నోటిఫై చేసినప్పటికి అందులో గిరిజనేతరులు వ్యవసాయం చేసుకుంటున్నారని, వారికి పహాణిలు, విఆర్ఓ సర్టిఫికెట్లు కూడా ఇస్తున్నారని ఎమ్మెల్యేలు చెప్పారు. వాటి ఆధారంగానే బ్యాంకులు పంట రుణాలు కూడా మంజూరు చేశాయన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ వ్యవసాయం కోసం పంట రుణాలు తీసుకున్నవారికి మాఫీ చేస్తామని చెప్పామని, గిరిజనుల భూముల్లో వ్యవసాయం చేసుకునే గిరిజనేతరులకు కూడా లబ్ది జరగాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పేదలకు సాయం చేసే విషయంలో నిబంధనల గిరి గీసుకుని కూర్చోవడం మంచిది కాదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. బ్యాంకుల వారిగా, జిల్లాల వారిగా నివేదికలు తెప్పించి వెంటనే వారికి రుణ మాఫీ పథకం వర్తింప చేయాలని సూచించారు. దీనికి సంబంధించిన నిధులను కూడా వెంటనే విడుదల చేస్తామని ప్రకటించారు.

---

సిపిఆర్ఓ టు సిఎం